# అంతస్సు

"నేను సుశ్శైను ఇక్కడకు తెచ్చేసుకుందామనుకుంటున్నాను!" అన్నది ఫోనులో రాధ.

పక్కన బాంబు పడ్డట్టే ఉలిక్కిపడింది సునీత.

ఆ ఫోను వచ్చింది అమెరికానుంచి. చేసింది ఆత్మీయ మిత్రురాలు రాధ.

అప్పుడు రాత్రి పదకొండు గంటలయింది.

చాలా సేపట ాకూ గొంతు విప్పలేకపోయింది సునీత.

"నేను చెబుతున్నది నిజం సునీ! నేనిప్పుడు ఎవ్వరూ లేనిదాన్ని...నాకు సుశ్శై కావాలి!" ఆ మాట అంటున్నప్పుడు రాధ దుఃఖాన్ని నిగ్రహించుకోలేకపోయింది. వలవలా ఏడ్వసాగింది.

సునీతకు ఏం మాట్లాడాలో అర్థంకాలేదు. ఆమెకూ బాధగానే వున్నది. "ఊరుకో...ఊరుకో..." అన్నది ఆమెను అనునయిస్తున్నట్లుగా.

రాధ ఒకప్పుడు చేసింది ఎంత పిచ్చి పని అయినా ఇప్పుడు తనేంవీ మాట్లాడ లేకపోతోంది.

"నేను ఆ రోజున అంతకు మించి చేయగలిగింది ఇంకేమైనా ఉన్నదంటావా... నువ్వే చెప్పు!" రాధే అడిగింది.

తను మాత్రం ఏం చెప్పగలదు... దాని బాధ తనకు తెలియదా?... అయిదు నిముషాల తరువాత కోలుకొని చిన్నగా అన్నది, "మరి శారదకు చెప్పావా?" అని సునీత.

"లేదు... నేను ఇండియాకు ఎల్లుండి బయల్దేరుతున్నాను... గంట క్రితమే కన్ఫరమ్డ్ టిక్కెట్లు వచ్చినయి... సరాసరి నీ దగ్గరకే వస్తున్నాను... నీ దగ్గరే ఒక నెల రోజులు ఉందామనుకుంటున్నా... నీకేమైనా అభ్యంతరమా?"

"బుద్ధుండే అడుగుతున్నావా ఆ మాట!" అన్నది కసురుకుంటున్నట్లుగా.

ఆ మంచం మీదే పక్కగా పడుకొని వున్న సునీత భర్తకు అర్థమయింది ఆ ఫోను ఎక్కడనుంచి వచ్చింది. పక్కకు తిరిగి పడుకున్నాడు... వాళ్ళ సంభాషణ అంత త్వరగా తేలేది కాదు అనేది ఆయనకు స్వానుభవమే!

"ఇంతకీ శారదకు ఫోను చేశావా లేదా?" ఇబ్బందిగానే అడిగింది. దీని మాటల్ని అదెలా తీసుకుంటుందో? "దాన్నీ ఇక్కడకు నాలుగు రోజులు ఉండేలా రమ్మనమని ఫోను చేయకపోయినావా... అప్పుడే ఆ విషయం ఆలోచించేవాళ్ళం!"

"నేను అక్కడకు వచ్చిం తరువాత నిర్ణయిద్దాం... మనమే వెళ్ళటమా, దాన్ని రమ్మనమనటమా అనేది!"

"సరే... నీ ఇష్టం!"

"నా జీవితం ఒక అగాధంలో కూరుకుపోయిందే!" అన్నది దిగులుగా రాధ. "పూర్తిగా నిర్జీవమైపోయింది!"

సునీతకు మిత్రురాలి మాటలు వింటుంటే కళ్ళు చెమ్మగిల్లసాగినయి.

❖ ❖ ❖

సరిగ్గా అయిదు రోజుల తరువాత ఉదయం పదకొండు గంటలప్పుడు సునీత, రాధ– సునీత గదిలో కూర్చొని వున్నారు.

అప్పటికి గంటయింది రాధ శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో దిగి ఇంటికి వచ్చి.

సునీతకు స్నేహితురాలి నీరసించిపోయిన ముఖం చూస్తుంటే చాలా బాధగా వున్నది. రాధది ప్రయాణపు బడలిక కాదు... మానసిక క్షోభ... ఎలాంటి రాధ ఎలా అయిపోయింది.

చెప్పాలంటే తమ ముగ్గురులో రాధే ఓ మెరుపులా మెరుస్తుండేది. అందంలోనే కాదు, తెలివిలోనూ, చొరవలోనూ, హుషారులోనూ... ఒక విధంగా అదే ప్రతిదాంట్లోనూ తమకు లీడరు... అది చెప్పినట్లు వినటమూ, చేయటమూ, దాని కనుసన్నలలో మెలగటమే తనకూ, శారదకూ తెలుసు...

అది పెళ్ళయి అమెరికా వెళ్ళిపోతుంటే తామిద్దరూ రెండ్రోజులు నిద్రాహారాలు లేకుండా వుండిపోయారు.

అది వెళ్ళిపోయి తరచూ ఫోనుచేస్తున్నా ఎదురుగ్గా లేదనే దిగులు తమను వెంటాడుతునే వుండేది.

దాని మాటల్లో అది అక్కడ ఎంత సంతోషంగా వున్నదీ తెలుస్తూనే వున్నా తమ లోటు లోటే...

తనకూ శారదకు కూడా పెళ్ళిళ్ళు అయిపోయినయి.

రాధ రాలేదు. రాలేకపోయినానంటూ పెళ్ళినాడు ఇద్దరికీ గంటగంటకూ ఫోన్లు...

అంతగా తమకు మరో ప్రాణమయిన అది, అమెరికా వెళ్ళిన రెండుసంవత్సరాల తరువాత ఒకసారి ఇండియాకు వచ్చినప్పుడు మాట్లాడిన తీరు, చేసిన పనీ తననూ, శారదనూ ఎంతగానో కలిచివేసింది.

దానికో కొడుకు...

ఆరోజు... అది తనింట్లో వున్న ఇరవైనాలుగు గంటల సమయం కళ్ళముందు సినిమాలా కనబడుతోంది...

అప్పటికే శారద అత్తగారింటికి వెళ్ళిపోయింది. ఆమె భర్త రాజమండ్రి దగ్గర ఓ గ్రామంలోనే ఉంటాడు... ఎన్నెకరాల పొలం వున్నదో కూడా తెలియనంత ఆస్తి... ఆధునిక యంత్రాలతో వ్యవసాయం... తోటలు... ఆ ఊరి మొత్తానికి అధిపతులు ఆ కుటుంబీకులే...

రాధ అమెరికానుంచి వస్తున్నదనీ, వారం రోజులకు మించి వుండదనీ తెలిసి శారదే హైద్రాబాద్‌కు వచ్చింది.

ఒకరోజు పూర్తిగా వాళ్ళ ముగ్గురికే కేటాయింపు.

ప్రదేశం: సునీత ఇల్లు...

"నాకు ఈ సుశ్శేగాడితో పెద్ద తలనొప్పి అయిందే... ఏం చేయాలో తెలియటంలేదు... ఓ చిన్నపాటి నిర్లక్ష్యాన్ని క్షణక్షణం గుర్తుచేస్తూ వీడు మమ్మల్ని ఏడిపించేస్తున్నాడు!" అన్నది రాధ కాస్తంత చికాగ్గా.

"రేపు మీరు ముసలాళ్ళయిం తరువాత పెట్టిపోషించాల్సింది వాడేనే!" శారద నవ్వుతూ అన్నది.

"ఇప్పటి వీడి దెబ్బకు తట్టుకుంటే ముసలాళ్ళం అయిన తరువాత ఆలోచిద్దాం ఆ విషయాన్ని!" అన్నది రాధ ముఖాన్ని చిటపటలాడిస్తూ.

"ఏంవిటే వాడితో అంత ఇబ్బంది?" సునీతే రాధ మాటలు వినీ వినీ విసుగుపుట్టి అడిగింది- కన్న కొడుకును గురించి ఎవరూ అలా మాట్లాడరు!

"మేం ఇద్దరం డబ్బు సంపాదించటానికే అమెరికా వెళ్ళాం... ఉదయం ఎనిమిదింటికి ఇంటి దగ్గర బయల్దేరితే మళ్ళా రాత్రి ఎనిమిదింటికే ఇంటికి తిరిగి వచ్చేది... ఆ సమయంలో వీడిని ఎవరు చూడాలి?" అన్నది విసురుగా. "మాకో గుదిబండయి కూర్చున్నాడు!"

"కన్న కొడుకుని గురించి ఎందుకనుకోవాలి అలా... అమ్మనో బామ్మనో తీసుకు వెళ్ళండి... లేదా అక్కడే ఎవరన్నా పిల్ల దొరుకుతుందేమో పెట్టుకోండి పగలంతా చూసేందుకు!"

"అక్కడ ఇక్కడలా కాదు... వీళ్ళను తీసుకు వెళ్ళినా, అక్కడ మనిషిని చూసినా ఖర్చు మన రూపాయిల్లో సంవత్సరానికి లక్షలే... నా సంపాదనంతా వీడికే ఖర్చయిపోతుంది... అంతకంటే నేను ఉద్యోగం మానేసి ఇంట్లో కూర్చోవటం మేలు!"

"అంత ఇబ్బందనుకున్నదానివి... ఎందుకు కన్నావ్?" కసురుకుంటున్నట్లుగా అడిగింది, కోపాన్ని ఆపుకోలేక సునీత.

రాధ మాట్లాడుతున్న తీరు ఆమెకు ఏ మాత్రం నచ్చలేదు. స్వంత పిల్లలను పెంచటం కూడా డబ్బులతో లెక్కించు కోవటమనేది చాలా అసహ్యకరమైన విషయం!

"బుద్ధి గడ్డితిని!... ఎప్పుడూ జాగ్రత్తగానే ఉండేవాళ్ళం... ఒక్కసారి అజాగ్రత్తతో కూడిన తొందరపాటుకు చెల్లిస్తున్న మూల్యం ఇది!" అన్నది దిగులుగా.

"చెబుతున్నావు కదా బుద్ధి గడ్డితిన్నదని... ఇప్పుడు ఇంకా చేయగలిగిందేమున్నది?"

రాధ ఆలోచిస్తున్నట్లుగా ఆగింది.

"ఆ సమస్యను పరిష్కరించుకునేందుకే ఇప్పుడు నేను ఇండియా వచ్చింది!" అన్నది దృఢంగా.

"ఏం చేద్దామని?" ఆత్రంగా సునీత, శారద ఒకేసారి అడిగారు.

"వీడిని ఎవరైనా పెంచుకుంటానంటే ఇచ్చేసి చేతులు దులుపుకుందామని!"

"ఏంవన్నావ్... మళ్ళీ అను... బుద్ధీ జ్ఞానం ఉండే మాట్లాడుతున్నావా?" ఇద్దరూ ఒకేసారి అరవటం మొదలు పెట్టారు.

"ఏం చేయను... తప్పని పరిస్థితి...!" నిర్లక్ష్యంగా వాళ్ళ వంక చూస్తూ అన్నది.

"వాడిని పెంచుకోవటానికి ఎవరూ దొరక్కపోతే ఏంచేస్తావ్?" శారద కోపాన్ని నిగ్రహించుకోలేక పోతోంది.

చీమ చిటుక్కుమన్నా వినబడేటంత నిశ్శబ్దమేర్పడింది వాళ్ళ నడుమ కొద్ది నిముషాలపాటు.

"భారతదేశంలో అనాథాశ్రమాలు చాలా ఉన్నయి!" అది చాలా చిన్న విషయం అన్నట్లుగా అన్నది రాధ– వాళ్ళ సంపాదనంతా పిల్లవాడి పెంపకానికే ఖర్చుపెట్టటమంటే, శ్రమటోడ్చి సంపాదించినదంతా బూడిదలో పోసినట్లే అనే భావన ఆమెలో పూర్తిగా పేరుకు పోయింది.

ఇద్దరూ స్నేహితురాలివంక ఛీత్కారంగా చూశారు.

"ఛ! ఛ!... ఎంత హీనంగా మాట్లాడుతున్నావు... మీ ఆయన ఒప్పుకున్నాడా?"

రాధ నవ్వింది. "నాకంటే ఆయనకే ఎక్కువ చికాగ్గా వున్నది!"

సునీత, శారద పాలిపోయిన ముఖాలతో, ఎంతో ఆత్మీయ మిత్రురాలు అనుకునే రాధనే కన్నార్పకుండా బొమ్మల్లా చూస్తున్నారు...

ఈ భూమ్మీద ఇలాంటి మనుష్యులు కూడా వుంటారా?

"తప్పేంవిటే... పుట్టలేదనుకుంటాను... ఓ పదేళ్ళు పోయిం తరువాత, కావాల్సినంత సంపాదించుకొని, ఉద్యోగం మానేసి, ఇక పిల్లల్ని కంటూనే ఇంట్లో కూర్చుంటాను... వాళ్ళను ఎంత చక్కగా పెంచగలనో అప్పుడు చూపిస్తాను.... ఇప్పుడు వీడిని మూడో మనిషి దగ్గర ఓ అనామకుడిలా పెంచేదానికంటే, అప్పుడు నా చేతులతో నేనే నా పిల్లల్ని రాజాల్లా తయారు చేస్తాను...అది ఎంత తృప్తికరంగా వుంటుందో ఆలోచించండి!" అన్నది తన ఆలోచన ఎంత సబబుగా వున్నదో తనకు తానే నచ్చచెప్పుకుంటున్నట్లే గాకుండా, వాళ్ళకూ నచ్చచెబుతున్నట్లుగా.

"ఛ! అసలు ఆ ఆలోచనే మాకు భయంకరంగా వున్నది... పోనీయ్ వాడి బామ్మగాని, అమ్మమ్మగాని ఉంచుకుంటారేమో అడక్కపోయినావా?"

"బామ్మే కొడుకుల పంచన జేరి కుక్కిమంచాల్లో చీకటి గదుల్లో మూలుగుతోంది... అమ్మమ్మ, తాతయ్య– నీ ఏర్పాట్లేవో నువ్వే చేసుకో మా వల్లకాదు అన్నారు... వాళ్ళ బాధలూ, బాధ్యతలు వాళ్ళకున్నయి... మేం కని పడేస్తుంటే పెంచేటందుకు వాళ్ళకూ ఓపికుండాలి కదా... కాదూ గూడదంటే ఒకటి రెండు సంవత్సరాలు ముక్కుతూ మూలుగుతూ అంగీకరించ వచ్చు... వాళ్ళను ఇబ్బందిపెట్టటం నాకు ఇష్టంలేదు!"

సునీత మాట్లాడలేదు. శారద మాట్లాడలేదు.

"మీ జీవితాలన్నీ కూపస్థమండూకాలే... బయటకు వచ్చి ప్రపంచాన్ని చూడండి... తండ్రులు లేరు, కొడుకులు లేరు... తల్లులు లేరు కూతుళ్ళు లేరు... ఎవరి ఆనందం వారిదే.... ఇంకా ఇక్కడ ఒకళ్ళంటే ఒకళ్ళు పట్టుకు పీకు లాడుతున్నారు గాని... అమెరికాలో అయితేనా... ఏ వయస్సులో వారయినా చిలకా గోరువంకలే!" అన్నది పకపకా నవ్వుతూ. "మా కెందుకొచ్చిన లంపటం ఇది!" వాళ్ళ మౌనాన్నే ఆసరాగా తీసుకొని తను చేస్తున్నదే ఎంతో సబబైన దన్నట్లుగా గొంతు పెంచింది.

"అక్కడే చూడకపోయినావా... ఎవరైనా పెంచుకుంటారేమో... అమెరికన్స్ చాలా మంది మన పిల్లల్ని ఇష్టపడతారని విన్నాను!" సునీత అంది.

"నా కిష్టం లేదే అది... అక్కడ అందరికీ తెలిసిపోతుంది... అటు ఆ పెంచుకుండే వాడూ అప్పుడప్పుడూ వీడిని తీసుకు వస్తుండవచ్చు... నావాడు కాదూ అనుకున్నప్పుడు ఇంకెప్పుడూ వాడు నా దృష్టిలో పడకూడదు... ఇక్కడ వదిలేశాననుకో... అక్కడ తెలిసిన వాళ్ళెవరైనా అడిగినా వాళ్ళ అమ్మమ్మ దగ్గర ఉంచాం అని చెప్పుకుంటాం!"

"అంటే నువ్వు చేస్తున్నది తప్పని నీకు తెలుసన్నమాట!"

"తప్పో ఒప్పో.... మా ఇబ్బందులు మావి... మా ఆనందం మాది!"

దాని ఆనందం మానవత్వంతో కూడినది కాదు... అదో రాక్షసక్రీడ...

ఫోను మ్రోగుతుంటే ఉలిక్కిపడ్డట్లుగా ముందు సునీతే కోలుకుంది. ఎదురుగ్గా రాధలేదు. తలెత్తి చూస్తే పక్కన మంచం మీద పడుకొని వున్నది... కళ్ళకు చేయి అడ్డుపెట్టుకొని.

టైం ఒంటిగంటయింది. ఫోనెత్తింది సునీత.

"నేను శారదనే... ఆ రాక్షసి వచ్చిందా... నన్ను రమ్మనమంటుందా... మీరు వస్తున్నారా... మీరు వస్తేనే బాగుంటుందే... సుబ్రహ్మణ్యంకు భోజనం ఇబ్బంది అవుతుంది నేను అక్కడకు వస్తే!"

ఒక్క క్షణం ఆలోచిస్తున్నట్లుగా ఆగి, "రాధకిస్తున్నాను మాట్లాడు...!" అన్నది సునీత.

రాధ నీరసంగా లేస్తూ, ఫోనందుకొని, "మేమే వద్దామనుకుంటున్నామే... రేపు సాయంత్రం బయల్దేరి వస్తాం... ఇవ్వాళే రావాలని వున్నదికాని జెట్‌లాగ్ నన్ను కదలనీయటంలేదు!" అన్నది.

"అరే... ఫైన్... మీరొస్తేనే నాకూ ఆనందంగా వుంటుంది... నాలుగు రోజులు ఉండేలా రాండి...!"

"నా మనస్సేం బాగోలేదు... ఉంటాలే... మూడ్ బాగుండకపోతే మాత్రం... రైల్లో రిజర్వేషన్ దొరక్కపోయినా బయల్దేరతాను... నన్ను ఆపవద్దు!" అన్నది పేలవంగా నవ్వుతూ.

"నీ మొండి తనం తెలిసిందే కదా... నువ్వేం చేసినా అడ్డుచెప్పనులే... రా!"

✣ ✣ ✣

"శారద ఒప్పుకుంటుందంటావా?" సునీత భయం భయంగా రాధ ముఖంలోకి చూస్తూ అడిగింది.

రాధ దిగులుగా మిత్రురాలి ముఖంలోకి చూచింది– శారద ఆనాడు అన్నమాటలనే మననం చేసుకుంటూ.

ఆరోజు...

చివరకు విసుగుపుట్టి, "వాడిని నువ్వెక్కడా పారేయవద్దు... నా కిచ్చేయ్... నేనూ వాడిని రాజాలాగానే పెంచగలను!" అన్నది శారద నిష్ఠూరంగా. .

రాధ నవ్వింది. "నీకు ఉన్నాడు కదా ఒక కొడుకు... ఇంకా వీడు కూడా ఎందుకు తోక!" అన్నది ఎగతాళిగా.

"ఒక పిల్లవాడున్నాడు... ఏడెనిమిది నెలల్లో మరో పిల్లో పిల్లవాడో నా ఒళ్ళో వాలవచ్చు... అయినా నీ కొడుకును నువ్వు అనాథగా చేయటం నేను సహించలేక పోతున్నాను... అందుకే ఆ నిర్ణయం తీసుకున్నది!"

"అయితే నీ ఖర్మ... అనుభవించు!" అంటూ పక్కన మంచం మీద వున్న తొమ్మిది నెలల సుశ్శేని తీసుకు వచ్చి శారద వళ్ళో కూలేసింది పకపకా నవ్వుతూ– నెత్తిమీద వున్న పెద్ద భారం తీరిపోయిందన్న ఆనందంతో.

"ఒక్కటి గుర్తుంచుకో... ఎప్పుడూ నువ్వు నా పిల్లవాడు, నా పిల్లవాడూ అంటూ నా దగ్గరకు రావద్దు... వచ్చినా స్నేహితురాలిలా వచ్చి చూసి వెళ్ళిపోవాలి... వాడికి నీలాంటి ఓ గుండెలేని స్త్రీ తల్లి అని తెలియకూడదు... అంతేకాదు నా పిల్లవాడిని నాకివ్వాలి అంటూ జీవితంలో ముందు ముందు నువ్వెప్పుడూ నన్ను అడగకూడదు!" అన్నది కసిగా.

"జీ హుజూర్!" అన్నది స్నేహితురాల్ని ఆనందంగా కౌగిలించుకుంటూ రాధ.

శారద ఆమెను అసహ్యంగా చూస్తూ తోసి వేసింది.

సుశ్శే వాళ్ళిద్దరి నడుమా గుక్కపట్టి ఏడ్వసాగాడు.

శారద వాడిని ఎత్తుకొని లేచి బాల్కనీలోకి తీసుకు వెళుతూ, "వాడికి నువ్వు పెట్టిన టోడిపేరు 'సుశ్శే' కూడా తీసిపారేస్తున్నాను... వాళ్ళ బామ్మకి ఇష్టమయిన సుబ్రహ్మణ్యశాస్త్రి అనే ఇక పిలుస్తాను!" అన్నది విసురుగా.

"నువ్వు వాడిని బోడయ్య అని పిలిచినా నాకభ్యంతరం లేదు... ఇక ఈ క్షణంనుంచీ వాడు నా పిల్లవాడు కాదు!"

తలుపు దగ్గర చప్పుడయితే తలెత్తింది సునీత... వచ్చింది ఆమె భర్త!

"రేపు రాత్రికి గౌతమికి దొరికినయి టిక్కెట్లు... తిరుగు ప్రయాణానికి తీసుకోలేదు... ఎప్పుడు బయల్దేరేదీ చెప్పలేమంటున్నారు కదా!" అన్నాడు ఆయన లోపలకు వస్తూ.

"ఫరవాలేదులేండి... అంతగా అయితే బస్సులో వచ్చేస్తాం!" అన్నది సునీత.

"అన్నయ్యగారూ! దీన్ని తీసుకు వెళుతూ ఇంట్లో మీకు ఇబ్బంది కలిగిస్తున్నాను!" అన్నది క్షమాపూర్వక స్వరంతో రాధ ఆయనతో.

"ఈ నాల్రోజులూ మా అమ్మాయిని అల్లుడినీ వచ్చి ఇక్కడే ఉండమన్నాం కదా... ఇంకా నాకు ఇబ్బందేం వున్నది!" ఆయన నవ్వేసి వెళ్ళిపోయాడు తన గదిలోకి.

మళ్ళా వాళ్ళిద్దరూ ఆలోచనల తెరల్లోకి జారిపోయారు.

"అది ఆ రోజు అన్నమాట నిజమే కాని... అప్పుడు నా భర్త ఇలా అర్థాంతరంగా చనిపోతాడని, ఇక నాకు పిల్లలు పుట్టరని... ఇండియాలో కూడా నా వాళ్ళులేక ఒంటరిగానే అమెరికాలో పడి నేను ఏడ్వవలసి వస్తుందని కలగన్నానా?" అన్నది దిగులుగా మిత్రురాలి ముఖంలోకి చూస్తూ రాధ. "నా మాట అది వినకపోతే... నువ్వే దానికి నచ్చ చెప్పాలి!"

సునీత గంయ్‌న లేచింది. "నేను ముందే చెబుతున్నాను... ఈ విషయంలో నేను మాట్లాడను... నాకు ఇద్దరూ సమానమే... నువ్వు అడుగు... అది ఇస్తానంటే నేనూ సంతోషిస్తాను... కాదన్నా నేను మాత్రం నోరు తెరవను!" అన్నది.

"నాకేం సాయం చేయలేనంటావా?"

"నిన్ను ఒంటరిగా దాని ముందుకు పంపకుండా నీ వెంట రావటమే నేను నీకు చేస్తున్న సాయం!"

✣ ✣ ✣

ఉదయం ఆరుగంటలకల్లా గౌతమి రాజమండ్రికి వచ్చింది. చల్లటి గాలి. గంట క్రితం చిరు జల్లులు పడ్డట్లుగా చుట్టుపక్కలంతా తడితడిగా వున్నది.

సునీత, రాధా రైలు దిగి స్టేషన్ బయటకు వచ్చేటప్పటికి శారద పంపిన కారు డ్రైవరు గేటు దగ్గరే నిలబడి కనబడ్డాడు.

వాళ్ళు ఇంటికి జేరేటప్పటికి తరువాత ఇరవై నిముషాలు పట్టింది.

ఆ ఇల్లు రాజమండ్రికి తూర్పు వైపుగా గోదావరి కనబడేటంత దగ్గరలో పెద్ద తోట నడుమ వున్నది.

చుట్టూ వివిధ రకాల పండ్ల చెట్లు... పూలచెట్లు... కొబ్బరి చెట్లు... పెద్ద గేటు... అన్ని వైపులా ముళ్ళ తీగతో వేసిన కంచె...

మధ్యలో మండువా లోగిలి... బయటకు పాత పెంకుటిల్లులా కనబడుతున్నా లోపల అధునాతనమైన అన్ని హంగులూ వున్నయి.

ఇంటిముందు ఒకవైపున ట్రాక్టర్ వున్నది... ట్రాలీ వున్నది... కాస్త దూరంగా గొడ్ల చావడి... అటూ ఇటూ తిరుగుతున్న పని వాళ్ళు...

కారు వాకిట్లో ఆగుతుండగానే లోపలనుండి శారద పరుగెత్తుకుంటూ బయటకు వస్తూనే చిక్కి ఎండుటాకులా వున్న రాధను చూస్తూ బిగుసుకుపోయింది- ఎంతగా మారిపోయిందీ అన్నట్లుగా చూస్తూ... ఆప్యాయంగా చేయి పట్టుకొని లోపలకి తీసుకు వెళ్ళింది...

"ఏమే సునీ!... ఇట్లా అయిందేమే ఇది!" అన్నది దిగాలుగా మిత్రురాలి వంక తిరిగి. రాధను చూసి అయిదారేళ్ళు అయివుంటుంది.

సునీత మాట్లాడలేదు. జాలిగా రాధ వంకే చూస్తూ వుండిపోయింది.

తరువాత అరగంటలోనే కాఫీలు త్రాగి కూర్చున్నారు.

శారద భర్త ఒకసారి వాళ్ళ వంక చూసి, పలకరించి తన పనుల్లోకి దిగిపోయాడు.

సునీతకు వాళ్ళిద్దరి నడుమ అలా కూర్చోవటం ఇబ్బందిగానే వున్నది. రాధ ఎందుకు వచ్చిందో శారదకు తెలియకపోయినా తనకు తెలుసు. శారద అందుకు అంగీకరిస్తుందని తను అనుకోదు... దాని వలన రాధ ఎంత మనక్షోభం చెందుతుందో తెలిసినా తను చేయగలిగిందేమీలేదు... ఇరవై సంవత్సరాలకు పైగా, నెలల పిల్లవాడిని తీసుకు వచ్చి,

తన కొడుకే అన్నట్లుగా పెంచిన వాడిని, ఈరోజు నుంచీ తనకేమీ కాదు అనుకోవటం... శారదకే కాదు ... ఎవరికైనా బాధే!

అంతదాకా ఎందుకు... శారద ఇంటిపేరే ఆ పిల్లవాడి ఇంటిపేరు... ఆమె గోత్రమే అతడి గోత్రమూ... అసలు సుబ్రహ్మణ్యశాస్త్రికే శారద తనను కన్న తల్లి కాదని తెలియదు...

ఆమె కొడుక్కు ఇతగాడు తన స్వంత తమ్ముడు కాదని తెలియదు... చెల్లెలకు స్వంత అన్నయ్య కాదని తెలియదు!

ఆమెను 'పిల్లలెంతమందమ్మా?' అని ఎవరైనా అడిగితే– 'ఇద్దరు మొగపిల్లలు, ఒక అమ్మాయి' అని చెబుతుంది.

అక్కడ ఆ రహస్యం తెలిసింది ఇద్దరికే... మొదటిది శారద అయితే... రెండో వ్యక్తి ఆమె భర్త!...

రాధ ఇప్పుడు తన కొడుకును తీసుకు వెళ్ళటానికే వచ్చిందనే విషయం శారద ఏమాత్రం ఊహించలేదు...

ముందుగా ఆ విషయం ఫోనులో చెబితే ఎలా వుండేదో కాని రాధ కూడా భయపడి చెప్పలేదు.

"సుశ్శే ఏడే?... ఏం చేస్తున్నాడు? బాగా చదువుతున్నాడా?" అడిగింది రాధ.

"సుశ్శే ఎవరే?" అన్నది వింతగా రాధ ముఖంలోకి చూస్తూ శారద– తనింట్లోకి ఆ పిల్లవాడు వచ్చిన తరువాత ఎన్నడూ ఆ పేరుతో పిలవకపోవటంతో... అసలు అక్కడ ఎవ్వరికీ సుబ్రహ్మణ్యశాస్త్రికి అలాంటి పేరు ఒకటి ఉండేదనే విషయమే తెలియదు...

చటుక్కున తలెత్తింది... ఇరవై రెండు సంవత్సరాల తరువాత మొట్ట మొదటిసారిగా నోరు తెరిచి ఆపేరు ఉచ్చరించిన ఆమె మిత్రురాలి ముఖంలోకి అయోమయంగా చూచింది.

సునీత ముఖాన్ని చటుక్కున పక్కకు తిప్పుకున్నది.

"నా పిల్లవాడే!" అన్నది చాలా లోగొంతుకతో దిగులుగా.

ఆ మాట వింటూనే శారద ముఖం తెల్లగా పాలిపోయింది... తడబడింది... ఏదో చాలా కొత్త విషయం వింటున్నట్లుగా కలవరపడింది... చుట్టూ ఎవరైనా ఉన్నారా, ఆ మాట విన్నారా అన్నట్లుగా కంగారుగా నలువైపులా చూసింది.

సరిగ్గా అప్పుడే వాకిట్లో ఎర్ర మారుతీ కారు వచ్చి ఆగింది.

శారద చటుక్కున లేచి వరండాలోకి వచ్చింది.

అందులోనుంచి సుబ్రహ్మణ్యశాస్త్రి దిగాడు... పొడుగ్గా ఆరడుగులకు కొద్ది తక్కువ ఎత్తులో వున్నాడు. బలిష్టంగా వున్నాడు. రెండంచుల ధోవతిని గోచీపోసి కట్టుకున్నాడు. పెద్దాపురం సిల్కులాల్చీ తొడుక్కున్నాడు... దానిమీద గచ్చకాయరంగు షాల్ కప్పుకున్నాడు... చెవులకు కుండలాలు... శిఖ... కుడిచేతికి బంగారు మురుగు... ఎడమచేతికి బంగారు చైనున్న గడియారం... అదే చేతిలో సెల్లు...

"నిన్న ఉదయాన వెళ్ళిన వాడివి ఇప్పుడా రావటం... నీకు భోజనం ఏర్పాటు ఎవరైనా చేశారా... లేకపోతే ఆ క్యాటరింగ్ భోజనం తినకుండా రెండు పండ్లు తిని కడుపు మాడ్చుకున్నావా?" విసురుగా అడిగింది శారద.

"రాత్రి నిడదవోలులో పెళ్ళి చేయించటానికి వెళుతున్నానని చెప్పే వెళ్ళాను కదమ్మా!... అక్కడ నాకు భోజనం వేరే ఏర్పాటు చేశారులే కాని, ఇప్పుడింకో పని పడింది... పిల్లవాడివేపు వాళ్ళు రాత్రి అప్పగింతలవ్వగానే, వాళ్ళతో పాటు సామర్లకోట వచ్చి వాళ్ళింట్లో గృహప్రవేశం, సత్యనారాయణ వ్రతం నేనే చేయించాలంటున్నారు!" అన్నాడు నవ్వుతూ.

"అదేంవిటిరా... వాళ్ళ బ్రాహ్మణుడు లేడా?"

"ఉన్నాడు... పిల్లవేపు వాళ్ళు ఏం చెప్పారో తెలియదు... వాళ్ళు పట్టుబట్టి కూర్చున్నారు... నా చేతుల మీదగానే ఆ కార్యక్రమం కూడా జరిగితే వధూవరుల భవిష్యత్తు సకల సౌభాగ్యాలతో నిండివుంటుందట... ఆ నమ్మకం వాళ్ళకు ఉన్నప్పుడు నేను కాదని ఎలా అనగలను... సరే అన్నాను... అందుకే రేపు మధ్యాహ్నం వ్రతమయిం తరువాత నేను ఇక్కడ ఇంటికి వచ్చేటంతవరకూ వాళ్ళ కారును నాకు వదిలేశారు!" అన్నాడు.

"వాళ్ళ కారెందుకురా... మన కారులేదా!" అన్నది శారద చికాగ్గా.

"నేను ఎక్కడ కాదంటానోనని దాంతో వాళ్ళు సంకెళ్ళు వేశారన్నమాట...!" అన్నాడు పకపకా నవ్వుతూ.

"ఇప్పుడే వెళ్ళాలా?"

"స్నానం, సంధ్యా పూర్తి చేసుకొని, నీ చేతి ఉపాహారం తిని బయల్దేరతాను... వధువు ఇంట్లో కార్యక్రమాలు ఇంకా పూర్తికాలేదు... ఇంటికి వెళ్ళి అవశిష్టాలు పూర్తిచేసుకొని వచ్చి చేయిస్తాలెండి అని చెప్పి వచ్చాను!"

"ఏం తిరుగుళ్ళో... ఆరోగ్యం పాడయ్యేలా... లోపలకు పద... సునీత పిన్ని హైద్రాబాద్ నుంచి వచ్చింది... రాధ కూడా అమెరికానుంచి వచ్చింది... దాన్నీ నువ్వు

ఇంతకు ముందు చూశావు కదా!" ఆ మాట అంటున్నప్పుడు కంఠం కాస్తంత తడబడింది, ఇందాక రాధ అన్న మాట గుర్తుకు రావటంతో. "పద చూద్దువుగాని! మనవాళ్ళు వచ్చినప్పుడన్నా ఇంట్లో ఉండకపోతే ఎట్లారా?"

సుబ్రహ్మణ్యశాస్త్రి లోపలకు వచ్చాడు.

సునీతను చూస్తూనే వంగి కాళ్ళకు నమస్కారం పెడుతూ, "కులాసానా పిన్నీ! బాబాయిగారు, పిల్లలూ కూడా వస్తే ఆనందంగా వుండేది... అమ్మయితే ఎప్పుడూ మీ కబుర్లే...!" అంటూనే రాధ వైపుకు తిరిగి, ఆమె కాళ్ళకూ నమస్కరిస్తూ, "అమ్మ మీ గురించి కూడా చెబుతుంటుంది... అమ్మ మీరు ఇండియా వచ్చినప్పుడల్లా హైదరాబాద్ వచ్చి కలుస్తుంటుంది గదా... నేనే చాలా కాలం క్రితం అమ్మతో వచ్చినప్పుడు ఒకసారి మిమ్మల్ని చూసినట్లు గుర్తు!" అంటూ పరీక్షగా ఆమె ముఖంలోకి చూస్తూనే ఆమె స్థితి అర్థం చేసుకున్నాడు... అప్పుడు గుర్తుకు వచ్చింది అమ్మ రెండు మూడేళ్ళ క్రితం ఆమె భర్త చనిపోయినట్లుగా చెప్పిన మాట...

అంతేకాదు, దుఃఖిస్తూ ఆరోజు ఆమె తలనిండా స్నానం చేయటమే గాకుండా తన చేతా చేయించింది, "నాకు చాలా ఆత్మీయురాలురా అది!" అంటూ.

ఆ స్నేహితురాళ్ళ ప్రేమలు అలాంటివి మరి!

తల వంచుకున్నాడు రెండు క్షణాలపాటు. ఇంకేం మాట్లాడాలో తెలియనట్లుగా.

తల్లి వైపుకు తిరిగి, "నేను రేపు సాయంత్రంలోగా ఎట్టి పరిస్థితులలోనూ వచ్చేస్తానమ్మా... పిన్నులిద్దరినీ వెళ్ళనీయబోకు!" అంటూ తన గదిలోకి వెళ్ళిపోయాడు సుబ్రహ్మణ్యశాస్త్రి.

తరువాత గంటకు అతడు వెళ్ళేటంత వరకూ శారదకు క్షణం తీరికలేకుండా పోయింది. నిముషానికోసారి తల్లిని ఏదో వంకతో పిలుస్తూనే వున్నాడు అతడు, ఈమె పరుగెడుతూనే వున్నది.

కారెక్కబోతూ సునీత వైపుకు చూస్తూ, "మీరు నేను వచ్చిందాకా వెళ్ళవద్దు పిన్నీ!" అన్నాడు. అందుకు మరో కారణం కూడా వున్నది. శారద అతడిని వచ్చేటప్పుడు మంచి చీరలు రెండు కొనుక్కురమ్మనమని చెప్పింది వాళ్ళకు పెట్టేటందుకు.

అందరికంటే వెనగ్గా నిల్చున్న రాధ కొడుకును తదేకంగా చూస్తున్నది. పచ్చటి ముఖం మీద, విభూతి పట్టీలు, మధ్యలో మూడో నేత్రంలా కుంకుమ బొట్టు... మెరిసిపోతున్న

నల్లటి గడ్డం... కాంతివంతమైన ఆ ముఖ వర్చస్సు అతడి వంక ఆమెను సూటిగా చూడనివ్వలేక పోతోంది... రెప్పలు అల్లల్లాడసాగినయి... ఆ కారు కనుమరుగయ్యేటంత వరకూ ఆమె స్పృహలో లేనట్లుగా నిల్చుండిపోయింది.

అతడు వెళ్ళిపోయిన పది నిముషాలకు ఫోను మ్రోగుతుంటే వెళ్ళి ఎత్తింది శారద.

చేసింది అన్నవరం నుంచి కూతురు పద్మ.

మాట్లాడి వస్తూనే, "రేపు సాయంత్రం వస్తానంటున్నది పద్మ... మీరుంటారా లేదా అని ఫోను చేసింది... ఉంటారు రమ్మనమని చెప్పాను... అట్లాగే రేపు రాత్రికే శశిధర్ కూడా దిగుతాడు!" అన్నది నవ్వుతూ. శశిధర్ ఆమె పెద్దకొడుకు. విశాఖపట్టణంలో ఇంజనీరుగా ఉద్యోగం చేస్తున్నాడు.

సునీత దగ్గర వాళ్ళకు చనువెక్కువ. "పిన్నీ పిన్నీ" అంటూ ఎప్పుడూ ఫోన్లు చేస్తుంటారు. హైదరాబాద్ వస్తే సునీత దగ్గరే వుంటారు. రాజమండ్రి రమ్మంటే ఆమె ఎప్పుడూ రాదని గోల. అందుకే ఇప్పుడు వీళ్ళు రావటంతో వాళ్ళిద్దరు కూడా బయల్దేరుతున్నది. ఆపైన వారం పది రోజులకు మించి తమ్ముణ్ణి చూడకుండా అన్నయ్యా, చిన్న అన్నయ్యను చూడకుండా చెల్లెలూ ఉండలేరు. వాళ్ళకు రావటానికి వీలుకాకపోతే సుబ్రహ్మణ్యశాస్త్రే ఎన్ని పనులున్నా వీలు చూసుకొని వెళ్ళి వాళ్ళ దగ్గర ఒక పూటయినా ఉండి వస్తుంటాడు.

"అదికాదే శారూ! శశిధర్‌తోపాటే వీడికీ ఇంజనీరింగ్ చెప్పించకపోయినావా?" అన్నది భోజనాలయిం తరువాత గదిలో మంచాల మీద జేరినప్పుడు రాధ.

సునీత ఇబ్బందిగా రాధ ముఖంలోకి చూసింది.

"అమ్మా! అదొక పెద్దగోల... సెవన్త్ అవుతుండగానే నేనీ బోడి ఇంగ్లీషు చదువులు చదవను... వేదపాఠశాలలో జేరి సంస్కృతం నేర్చుకుంటాను... నాకు వేదం చదవాలని వున్నదీ అంటూ!... నేను చెప్పాను... వాళ్ళ నాన్న చెప్పాడు... వాళ్ళన్నయ్య చెప్పాడు... వాళ్ళ చెల్లెలు వాడి మాటలకు ఎగతాళి చేసింది... అయినా వింటేనా... నానా గోలచేసి... చివరకు అనుకున్నది సాధించాడు... మేం కాదన్నా మొండికెత్తి ఆ మార్గంలో వెళితేనేం, ఈరోజున వాడి పేరు రాజమండ్రి లోనూ, చుట్టుపక్కలా మారుమ్రోగిపోతున్నది!"

"ఇంజనీరు ముందు ఇదేం సంపాదనే... ఆపైన ఆ హోదా ఎక్కడొస్తుంది!" గునుస్తూ అన్నది రాధ.

తన పిల్లవాడిని శారద నిర్లక్ష్యంచేసి ఈ బోడి చదువులు డబ్బు తక్కువ ఖర్చుతో చదివించిందేమోనని మనస్సులో కించిత్ అసహనంగా వున్నది. ఇంజనీరింగ్ చదివివుంటే అమెరికాలో నెలసరి ఆదాయం లక్షల్లో వుండేది!

శారద పకపకా నవ్వింది. "పెద్దవాడు ఇంజనీరింగ్ చేసినమాట నిజమే కాని, వీడి సంపాదన ముందు వాడి సంపాదనెంతే... వీడికున్న పరపతిగాని, వీడి మాటకున్న విలువగాని వాడికెక్కడిది... వాడిది మరొకడి క్రింద బానిస బ్రతుకు... వీడో... నలుగురులో రాజానే... అడుగులకు మడుగులొత్తుతారు... పొద్దున్నే విన్నావుగా వాడి మాటలు... వీడు పెళ్ళి చేయిస్తే ఆ సంసారం సుఖశాంతులతో నిండిపోతుందనేది వీళ్ళ ఒక్కళ్ళ ఉద్దేశ్యమే కాదు... రాజమండ్రి లోనూ, చుట్టుపక్కలా కాస్త తెలిసినవాడిని ఎవరిని కదిలించినా అదేమాట చెబుతారు!" ఆమె కళ్ళు కొడుకు ఉన్నతికి గర్వంతో మెరిసిపోతున్నయి.

రాధ మౌనంగా వింటున్నది శారద మాటలను.

"నాలుగయిదు ఏళ్ళల్లో ఘనాపాఠి అవ్వాలనేది వాడి కోరిక... వాడు అనుకున్నాడు అంటే సాధించి తీరతాడు...ఇప్పటికే యజుర్వేదం పూర్తిచేసి ఋగ్వేదం నేర్చుకుంటున్నాడు!... వాడిని కొందరు కావాలని శుభకార్యాలకు ప్రత్యేకంగా తీసుకు వెళతారు... ఎందుకో తెలుసా... వాడు పూర్వమే చేయిస్తాడుకాని అపరం చేయించడు!...వాడు ఎంత నిష్ఠగా వుంటాడో మీకు తెలియదు!" చాలా గొప్పగా కొడుకును గురించి చెప్పుకు పోతున్నది శారద.

రాధ ముఖంలోకి చూసింది సునీత. ఆమెకు చాలా భయంగా వున్నది. రాధ తన కోరికను బయట పెడితే శారద ఎలా తీసుకుంటుందా అని. అటు సుబ్రహ్మణ్యశాస్త్రీ ఏం గొడవ చేస్తాడో... కాదూ గూడదు అన్నా, వెధవ ఇంగ్లీషు చదువులు అక్కరలేదని సంస్కృతం నేర్చుకొని వేదపండితుడయినవాడు అమెరికాకు వెళతాడా?

అసలు ఆ ఇంట్లో రాధ కోరిక ఒక విస్ఫోటనాన్నే సృష్టిస్తుందేమో?

సునీతకు చాలా దిగులుగా వున్నది. రాధ వంక చూడాలంటేనే భయంగా వున్నది. శారదంటే జాలివేస్తున్నది. దిగులు వేస్తున్నది.

రాత్రి భోజనాలయినయి. పది గంటలప్పుడు ముగ్గురూ మంచాల మీద జేరారు.

"అదికాదే రాధా! ఇప్పుడు ఇంకా నువ్వు అమెరికాలో వుండి సాధించేదేమిటి?... ఇండియాకు వచ్చెయ్యక... నీ అనుభవానికి హైద్రాబాద్‌లో ఉద్యోగం దొరకదా... ఇక్కడ

మేమంతా వున్నాం... అక్కడ నీకెవ్వరున్నారని!" అన్నది అటు తిరిగి పడుకున్న రాధను తనవైపుకు తిప్పుకుంటూ శారద.

"అక్కడ మేం సంపాదించుకున్న ఆస్తి కోట్లలో వున్నది... నేను ఉద్యోగం చేయకపోయినా అక్కడ నా జీవితం హాయిగా వెళ్ళిపోతుంది!" అన్నది బింకంగా రాధ.

అసలు సుడిగుండంలోకి ఇప్పుడు కాలుపెడుతున్నట్లే అనిపించగా ఆ రాత్రి ఇక ముగ్గురికీ నిద్ర ఉండదేమో నన్నంత భయపడింది సునీత.

"మనిషి తోడు అవసరం లేదా... డబ్బు ఒక్కటేనా మనిషికి కావాల్సింది!" కసురుకుంటున్నట్లుగా అన్నది శారద. "నీకెప్పుడూ డబ్బు యావ తప్పా మరొకటి లేదేమే!"

"నా ఆలోచనలు నాకున్నయి... నేనే ఏదో ఏర్పాటు చేసుకుంటాను!" అన్నది ముభావంగా రాధ– అసలు విషయంలోకి వస్తున్నాను అన్నట్లుగా.

అయిపోయింది... బ్రహ్మాండం బ్రద్దలవ్వబోతోంది... సునీతకు భయంతో ఒణుకు వస్తోంది.

శారదా కించిత్ అసహనంగా రాధ వంక చూచింది. దానికిప్పుడు ఎవ్వరూ లేరు... భర్త చనిపోయాడు... మరల పిల్లలు పుట్టలేదు... ఒంటరిదయిపోయింది!– ఆ మాటలు అనుకుంటుంటే ఆమె మనస్సునంతా ఓ తెలియని భయం చీకటిలా క్రమ్మివేసింది... ఒళ్ళు జలదరించింది... తన కొడుకును తీసుకు వెళ్ళాలనే ఉద్దేశ్యంతోగాని అది రాలేదు కదా... అందునా ఎప్పుడు ఇండియా వచ్చినా తన ఊరు రమ్మనమంటే రానిది ఇప్పుడు ప్రత్యేకంగా తనంతట తానే వస్తున్నానని చెప్పి మరీ వచ్చిందీ అంటే... ఒళ్ళంతా చెమటలు పట్టసాగింది... ఆ ఆలోచననే భరించ లేనట్లుగా గట్టిగా కళ్ళు మూసుకున్నది... ఇష్టదైవమైన వెంకటేశ్వరుని ప్రార్థించుకున్నది...'వద్దు... వద్దు... దానిలో అలాంటి ఆలోచనలను కలిగించ వద్దు స్వామీ... అది ఇప్పుడు ఊరికినే నన్ను చూడటానికే వచ్చినట్లుగా చూడు...' అని పదే పదే అనుకున్నది...

'ఛ! ఆలాంటి ఆలోచనే వుంటే అది ఇక్కడకు వస్తున్నానని చెప్పినప్పుడే ఆ విషయమూ చెప్పి వుండేది... కాకపోతే సునీతయినా హెచ్చరించి వుండేది...' అని తనకు తాను నచ్చజెప్పుకున్నది.

కొద్ది క్షణాల తరువాత కోలుకొని, 'అడగనీయ్... అడిగితే మూతి మీద వాతలు పెట్టి మరీ పంపిస్తాను... వాడిని తన ఒళ్ళో పడుకోబెట్టినప్పుడు తను స్పష్టంగా చెప్పలేదా...

అందుకు అది అంగీకరించలేదా... ఇప్పుడు మాట మారిస్తే తను ఊరుకుంటుందా...?' అనుకున్నది.

అయిదు నిముషాలకు గానీ మనస్సు కుదుటపడలేదు- పొద్దున్నే సునీతను అడిగితే తెలిసిపోతుందిలే... అని ధైర్యం చెప్పుకున్నది. అసలు అది గనుక ఇప్పుడా విషయం ఎత్తినా, పిల్లవాడికి రాధే వాడి స్వంత తల్లి అని తెలిసినా- ఆమె గుండె ఒక్కసారిగా జలదరించింది- తను భరించగలదా? వాడు... వాడు మాత్రం...

ఉహూఁ... ఎట్టి పరిస్థితులలోనూ వాడికా విషయం తెలియనీయకూడదు! తనకూ వాళ్ళ నాన్నకూ తప్ప తెలియని ఆ విషయం ఇప్పుడు ఇక్కడ మరెవరి చెవినా పడటానికే వీల్లేదు...

అయినా తను అనవసరంగా భయపడుతున్నది గాని... నిజంగా దానికి అలాంటి ఆలోచన వున్నా... ఇంగ్లీషు ముక్కలు రాని ఈ వేదపండితుడిని చూచిం తరువాతయినా- అది మనసు మార్చుకొని తన ఆలోచనను విరమించుకుంటుంది... తను భయపడ వలసిందేమీ లేదు...

ముగ్గురూ ఎవరి ఆలోచనలలో వారు కళ్ళు మూసుకున్నారు... చాలా సేపటివరకూ ఎవరికీ నిద్ర పట్టలేదు... తరువాత ఎప్పుడు పట్టిందో వాళ్ళకే తెలియదు...

తెల్లవారుజామున మూడు గంటలప్పుడు సునీతకు మెలుకువ వచ్చింది. బాత్‌రూంకు వెళ్దామని లేస్తే మంచం మీద రాధ కనబడలేదు. బాత్‌రూం తలుపు వంక చూచింది. అందులో లైటు వెలగటంలేదు.

వాకిటి వంక చూచింది.... తలుపు దగ్గరకు వేసివున్నట్లుగా కనబడింది.

వడివడిగా తలుపు తీసుకొని బయటకు వచ్చింది.

వాకిటి పెంకుటి వసారాలో స్తంభాన్ని ఆనుకొని క్రీనీడలో కూర్చొని వున్నది రాధ.

"ఎందుకు ఇక్కడ కూర్చున్నావ్ చీకట్లో ఒక్కదానివి?" ముందుకు వచ్చి మెడ వంచి రాధ ముఖంలోకే చూస్తూ ఆదుర్దాగా అడిగింది.

రాధ తలెత్తి సునీత ముఖంలోకి చూచింది.

ఆ గుడ్డి వెలుగులో కూడా కనబడింది ఆమె చెంపలు కన్నీటితో తడిసి ముద్దయి వున్నయ్యని.

"ఏమైందే... ఎందుకా ఏడుపు!" చటుక్కున ఆమె పక్కన కూర్చుంటూ అన్నది.

"పొద్దున్నే వెళ్ళి పోదామే మనం!" అన్నది రాధ సునీత చేయిపట్టుకుంటూ.

"అదేంవిటి... రెండ్రోజులు వుందామనే వచ్చాం కదా... మధ్యలో ఈ గొడవేమిటి... వాడు వెళుతూ వెళుతూ చెప్పను కూడా చెప్పాడు తను వచ్చిందాకా ఉండమని!" విసురుగా అన్నది.

"నాకు ఉండాలనిపించటం లేదే!" అన్నది రాధ నీరసంగా. ఆమెకు దుఃఖం ఆగటంలేదు.

"రేపు సాయంత్రానికి శశిధరూ, పద్మా కూడా మనమొచ్చామనే వస్తున్నారు!"

"ఎవరొచ్చినా సరే... కావాలంటే నువ్వుండు... నేను వెళ్ళిపోతాను!" లేచి నిలబడింది విసురుగా. "నేను ఉండలేనని చెబుతున్నానా... నేను చస్తేనేకాని నాకు ఎక్కడా శాంతి లభించదు!"

రాధ మాట తీరుకు అవాక్కయింది సునీత. 'మరి నువ్వు శారదను అడుగుదామనుకున్నది ఏం చేశావ్?' అని అడగటానికి నోరు తెరవబోయింది.

"సుశ్శేను తీసుకు వెళ్దామని అమెరికానుండల్లా వచ్చాను... వద్దే... ఊహ తెలిసీ తెలియని వయస్సులోనే ఏ కన్నతల్లీ చేయగూడని అన్యాయాన్ని నేను ఒకసారి వాడికి చేశాను... ఇప్పుడు అన్నీ తెలిసిన వాడికి అసలు సంగతి చెప్పి మరోసారి అన్యాయం చేసి... నిజమైన తల్లి ప్రేమనూ, అనుబంధాన్ని వాడికి దూరం చేయలేనే!" వలవలా ఏడ్వసాగింది రాధ. "నేను అమెరికా వెళ్ళిపోతాను... ఇక్కడ ఉండలేను!"

అప్పుడే వాకిటి దగ్గర ఒక స్త్రీ నీడ చటుక్కున పక్కకు తప్పుకున్నది.

(రచన: మాసపత్రిక: మార్చి, 2009)